సాక్షి
వికారాబాద్
సోమవారం, 12, ఆగస్టు, 2024



కూలీల కొరత..

వానాకాలం మొదలయినప్పటికీ.. వరుణుడు కరుణ చూపడం లేదు. దీంతో భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టాయి. 8లో▸



ఐనా'పూర్' రోడ్డు

కురుస్తున్న వర్షాలకు గ్రామీణ ప్రాంత రోడ్లు అధ్వానంగా మారాయి. దారి పొడవునా గుంతలు ఏర్పడి, నీరు నిలుస్తున్నాయి. 8లో▸



పశువైద్యం.. దైవాదీనం

పశువైద్యం అందని ద్రాక్షలా మారింది. సిబ్బంది కొరత, సరిపడా వసతులు లేక సరైన వైద్యం అందడం లేదు. 9లో▸

నిరీక్షణకు తెర

రేషన్ కార్డుల జారీకి ప్రభుత్వం పచ్చజెండా



చౌక ధరల దుకాణంలో సరుకుల పంపిణీ (ఫైల్)

- మార్గదర్శకాలు విడుదల చేసిన మంత్రులు
- పేదల్లో చిగురిస్తున్న ఆశలు
- కొత్త సభ్యులను చేర్చే విషయంపై స్పష్టత కరువు

వికారాబాద్: కొత్త రేషన్ కార్డుల కోసం ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న పేదలకు ఆశలు చిగురిస్తున్నాయి. కొత్త రేషన్‌కార్డుల జారీ విషయంలో ప్రభుత్వం ప్రకటన చేసింది. సూచన ప్రాయంగా మంత్రులు మార్గదర్శకాలు విడుదల చేశారు. గతంలో టీఆర్‌ఎస్ ప్రభుత్వం రేషన్ కార్డుల విషయంలో ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. ఏడాది క్రితం దరఖాస్తులు చేసుకున్న వారిలో సగం మందికి కార్డులు ఇచ్చి చేతులు దులుపుకొంది. ఉన్న కార్డుల్లో కొత్త పేరు ఎక్కించే విషయంలోనూ మీన మేశాలు లెక్కిస్తోంది. ఎనిమిదేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం ఆహార భద్రతా పథకంలో భాగంగా లబ్ధిదారులను ఎంపిక చేసి అప్పుడు ఉన్న కుటుంబ సభ్యుల వివరాలు మాత్రమే చేర్చింది. ఎనిమిదేళ్లుగా పెళ్లిలు చేసుకుని అత్తారింటికి వచ్చిన వారు.. వారి కుటుంబాల్లో సంతానం ఇలా ఎవరికీ రేషన్‌కార్డుల్లో పేరు లేదు. మరికొందరివి సాంకేతిక సమస్యల కారణంగా తొలగించారు. మృతి చెందిన వారి పేర్లను కార్డుల నుంచి తొలగిస్తున్న ప్రభుత్వం కొత్తగా వివాహమైనా, జన్మించిన వారి వివరాలు చేర్చేందుకు మాత్రం అవకాశం కల్పించలేదు. కొత్త కార్డులు ఇచ్చేందుకు ప్రకటన విడుదల చేసిన నేపథ్యంలో నూతన కార్డులతో పాటుగా ఆహార భద్రత కార్డుల్లో కొత్త వారిని చేర్చాలని పేదలు కోరుతున్నారు.

పెండింగ్‌లో దరఖాస్తులు

తెలంగాణ ప్రభుత్వం ఎనిమిదేళ్ల క్రితం ఆహారభద్రత లబ్ధిదారులను ఎంపిక చేసి జాబితాను ఆన్‌లైన్‌లో ఉంచింది. రేషన్ కార్డులు జారీ చేయకుండా కార్డులు ఇచ్చే వరకు అంటూ ఓ ఏడాదికి సరిపడా కూపన్లు ఇచ్చింది. ఆ తదనంతరం కూపన్ల పంపిణీ సైతం మానేశారు. దీంతో కొంత కాలం కూపన్లు నెట్ సెంటర్లలో తీసుకున్నారు. అనంతరం పూర్తి స్థాయిలో బయోమెట్రిక్ విధానం తీసుకువచ్చి ఆన్‌లైన్ విధానం అమలు చేస్తోంది. అయితే కుటుంబాల్లో పెరిగిన సభ్యులను, వచ్చి చేరిన వారిని ఆహార భద్రతా లబ్ధిదారుల జాబితాలో చేర్చడంపై ఎటువంటి నిర్ణయం తీసుకోవడం లేదు. దీంతో వారికి ఏడేళ్లుగా ఎదురు చూపులు తప్పడం లేదు. జిల్లాలో ఇప్పటి వరకు 35,000 మంది చేర్చాల్సిన సభ్యులున్నారు. ఇటీవల కొత్త ప్రభుత్వం కొలువు దీరాక ప్రజాపాలన పేరిట దరఖాస్తులు తీసుకోగా ఇందులో ఆరు గ్యారంటీలకు సంబంధించిన వాటితో పాటు మరో 39 వేల దరఖాస్తులు అదనంగా వచ్చాయి. ఇందులో మెజార్టీ దరఖాస్తులు కొత్త రేషన్ కార్డుల కోసం పెట్టుకున్నవే. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రేషన్ రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో పేదలు నష్టపోతున్నారు. రేషన్ సరఫరాలో అవకతవకలను అరికట్టేందుకు ఎన్నో సంస్కరణలు ప్రవేశ పెడుతూ వస్తున్న పౌరసరఫరాల శాఖ అర్హులకు న్యాయం చేయడంలో అలసత్వం వహిస్తోంది.

రేషన్ కార్డుల వివరాలు

ఎఫ్ఎస్సీ	2,08,162
అంత్యోదయ	26,730
అన్నపూర్ణ	39
మొత్తం ఆహార భద్రత కార్డులు	2,34,931

అంత్యోదయ కార్డులకే చక్కెర

జిల్లాలో ఉన్న 20 మండలాల్లో 588 చౌకధరల దుకాణాలుండగా మొత్తం ఇప్పటి 2,34,931 ఆహార భద్రతా కార్డులు ఇచ్చారు. వీటి ద్వారా ప్రతీ నెల 4,673 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం సరఫరా చేస్తున్నారు. వీటితో పాటు అంత్యోదయ కార్డుల లబ్ధిదారులకు మాత్రమే చక్కెర పంపిణీ చేస్తున్నారు. గతంలో ప్రతీ కార్డుదారుడికి చక్కెర పంపిణీ చేసే వారు ప్రస్తుతం నిలిపివేశారు.



ధర్నాలో పాల్గొన్న పట్నం నరేందర్‌రెడ్డి తదితరులు

ఫార్మా కంపెనీలతోనే అభివృద్ధా..?

- కొడంగల్ మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి
- రైతులకు మద్దతుగా ధర్నా

దుద్యాల్: ఫార్మా కంపెనీల ఏర్పాటును నిరసిస్తూ రైతులు కన్నెర్ర చేశారు. ఈ మేరకు ఆదివారం మండల పరిధిలోని హకీంపేట ప్రధాన కూడలిలో భూ బాధితులు ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంతంగా వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్న రైతుల అనుమతులు లేకుండా ఫార్మా కంపెనీల ఏర్పాటుకు భూ సేకరణ నోటిఫికేషన్ విడుదల చేయడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫార్మా కంపెనీలు ఏర్పాటు చేస్తేనే అభివృద్ధి సాధ్యమా అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఎవరికీ నష్టం లేకుండా నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భూముల్లో ఫార్మా కంపెనీలు కాకుండా ఇతర కంపెనీలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. హకీంపేట గ్రామ పరిధికి చెందిన రైతుల నుంచి 505 ఎకరాలు, పోలేపల్లిలో 130 ఎకరాలు, లగచెర్ల, పులిచెర్ల తండా, రోటి బండా తండాల పరిధికి చెందిన రైతుల నుండి 643 ఎకరాలను, మొత్తంగా ఐదు గ్రామాల నుంచి 1,274 ఎకరాలను ఫార్మా కంపనీ ఏర్పాటుకు కేటాయించి రైతులు నోట్లో మట్టి కొడుతున్నారన్నారు. ఏదైన కంపెనీ ఏర్పాటు చేయాలంటే ముందుగా రైతులను సంప్రదించాక, రైతులు అనుకూలంగా ఉంటేనే నిర్ణయం తీసుకోవాలి. కానీ ఏకాభిప్రాయంగా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోని బలవంతంగా భూ సేకరణ చేయడమేంటని ప్రశ్నించారు. బలవంతపు భూసేకరణ చేస్తే బీఆర్‌ఎస్ రైతులతో కలిసి పోరాటాలు చేస్తుందని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో గ్రంథాలయ మాజీ చైర్మన్ శ్యాసం రామకృష్ణ, దౌల్తాబాద్ జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోట్ల మైపాల్, తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు ఎరన్‌పల్లి శ్రీనివాస్, దుద్యాల్ మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు బోగమోని సురేశ్ రాజ్, బీఆర్‌ఎస్ నాయకులు యాదగిరి, హకీంపేట యాదయ్య, భీములు, మడిగా శ్రీనివాస్, నరేశ్ గౌడ్, యాదయ్య, బుగ్గప్ప, నారాయణ, వెంకటయ్య, శివ కుమార్, మణికంఠ గౌడ్ మరియు ఆయా గ్రామాల భూ బాధిత రైతులు, యువకులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

నేడు వికారాబాద్ బంద్

అనంతగిరి: బంగ్లాదేశ్‌లో జరుగుతున్న నరమేధాన్ని నిరసిస్తూ సోమవారం వికారాబాద్ పట్టణంలో స్వచ్ఛంద బంద్ పాటిస్తున్నట్లు హిందూ ఐక్యవేదిక ప్రతినిధులు తెలిపారు. బంగ్లాదేశ్‌లో నెలకొన్న హింసాత్మక పరిస్థితులు.. నరమేధాన్ని ఖండిస్తూ బంద్, నిరసన ర్యాలీ ఉంటుందన్నారు. ఉదయం 9గంటల నుంచి వికారాబాద్ పట్టణంలోని రామమందిరం నుంచి భారీగా శాంతియుత ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. కావున వర్తక, వ్యాపార, వాణిజ్య సముదాయాలు సహకరించాలని కోరారు.

భూ సదస్సును విజయవంతం చేయండి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్



కరపత్రం ఆవిష్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

తాండూరు టౌన్: అభివృద్ధి పేరిట ప్రభుత్వం పేదల భూములు లాక్కోవడాన్ని నిరసిస్తూ ఈ నెల 13న నిర్వహించనున్న భూ సదస్సును విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలో ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంగళవారం కొడంగల్‌లోని రెడ్డి బసిరెడ్డి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే భూ సదస్సుకు పెద్ద ఎత్తున హాజరవ్వాలని కోరారు. అభివృద్ధి పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం ఫార్మ కంపెనీల స్థాపనకు హకీంపేట్, లగచర్ల, పోలేపల్లి, పులిచర్లతండా, రోటిబండ తండాల్లో 1,274 ఎకరాల్లో, ఎరాన్‌పల్లిలో మెడికల్, నర్సింగ్ కళాశాల పేరిట 74 ఎకరాల పేదల భూములను సేకరించిందన్నారు. కొడంగల్ నియోజకవర్గంలో అన్యాక్రాంతమైన 1,154 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోకుండా పేదల భూములు సేకరించడం సరికాదని మండిపడ్డారు. పట్టా పాసుబుక్‌లు ఉన్న భూములకు సైతం రైతులు ధరణి సమస్యలతో ఇబ్బంది పడుతున్నారన్నారు. పేదల భూములను లాక్కుంటే పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కె.చంద్రయ్య, రత్నం, చంద్రయ్య, నర్సింహులు, రాములు, గోపాల్, వెంకటేశ్, బలరాం, నరేశ్, రాజు, రవి, రఘుపతి తదితరులున్నారు.

నవాబుపేట ఎస్‌ఐ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న అరుణ్ కుమార్ గౌడ్

నవాబుపేట: నవాబుపేట నూతన ఎస్‌ఐగా అరుణ్ కుమార్ గౌడ్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన భరత్ భూషన్‌ను ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేశారు. సంగారెడ్డి జిల్లా కోహీర్ ఎస్‌ఐగా పనిచేస్తున్న అరుణ్ గౌడ్ బదిలీపై నవాబుపేటకు విచ్చేశారు.

సర్వీస్ రూల్స్ అమలు చేయాలి

ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్



మాట్లాడుతున్న వేణుగోపాల్

కొడంగల్: సర్వీస్ రూల్స్ అమలు చేసి మండల విద్యాధికారుల పోస్టులను భర్తీ చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని కాచిగూడలో జరిగిన ఎస్టీయూ రాష్ట్ర తృతీయ కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ జీహెచ్ఎం, జేఎల్ ప్రమోషన్లకు అడ్డంకిగా ఉన్న జీఓలను రద్దు చేసి అర్హులైన స్కూల్ అసిస్టెంట్లకు ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. సీనియారిటీ ప్రకారం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు హెడ్ మాస్టర్లుగా ప్రమోషన్లు కల్పించాలన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ఆవోపా రాష్ట్ర కార్యదర్శిగా ఆనంద్‌బాబు

షాద్‌నగర్: ఆవోపా రాష్ట్ర కార్యదర్శిగా షాద్‌నగర్ పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త పలబట్ల ఆనంద్‌బాబు ఎన్నికయ్యారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆనంద్‌బాబును ఎన్నుకున్నారు. అనంతరం ఆవోపా రాష్ట్ర అధ్యక్షుడు మలిపెద్ది శంకర్, ఆర్థిక కార్యదర్శి కందికొండ శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కట్టా రవికుమార్ నూతనంగా ఎన్నికైన ఆనంద్‌బాబును ఘనంగా సన్మానించారు.



గంగారంలో పర్యటిస్తున్న బీజేపీ నాయకులు

మున్సిపాలిటీల్లో అభివృద్ధి శూన్యం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి

అనంతగిరి: ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి అన్నారు. పార్టీ ఆధ్వర్యంలో చేపడుతున్న మున్సిపల్ దర్బార్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం పట్టణంలోని 9, 16, 27 వార్డులలో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీలు అభివృద్ధికి దూరంగా ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిధుల లేమితో అభివృద్ధి శూన్యమైందన్నారు. ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి జిల్లా రూపురేఖలు మార్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివరాజు, పార్టీ పట్టణ అధ్యక్షుడు నరోత్తంరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రాములు, డాక్టర్ రాజశేఖర్, ఉప్పు అమర్, వినోద్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ చిన్నారి మృతి

- కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు
- ఆస్పత్రి ఎదుట కుటుంబసభ్యుల ఆందోళన
- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపణ
- సర్దిచెప్పి పంపించిన పోలీసులు



మృతదేహం పట్టుకొని రోదిస్తున్న కుటుంబీకులు

ఇబ్రహీంపట్నం: చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించిన చిన్నారి మృతి చెందడంతో కుటుంబసభ్యులు ఆందోళనకు దిగారు. ఈ సంఘటన ఇబ్రహీంపట్నంలో చోటుచేసుకుంది. వివరాలివీ.. మండలంలోని రాయపోల్ గ్రామానికి చెందిన ప్రవళిక, మహేశ్ దంపతుల కుమారుడు ప్రజ్వల్ (8 నెలలు)కు జ్వరం రావడంతో శనివారం ఇబ్రహీంపట్నంలోని రవికృష్ణ చిల్డ్రన్స్ హాస్పిటల్‌లో చేర్పించారు. డెంగీగా వైద్యులు నిర్ధారించారు. రక్తంలో ప్లేట్లెట్స్ తగ్గిపోయాయని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని ఆదివారం ఉదయం తల్లిదండ్రులకు తెలిపారు. వెంటనే నగరానికి తరలిస్తుండగా ప్రజ్వల్ మార్గమాధ్యలో మృతిచెందాడు. దీంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆగ్రహానికి గురై ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. శనివారం ఆస్పత్రిలో చేర్పిస్తే సరైన పరీక్షలు చేయలేదని, వైద్యులు అందుబాటులో లేక కాలయాపన చేసినందుకే చిన్నారి మృతి చెందాడని ఆరోపించారు. వైద్యుల నిర్లక్ష్యమేనని కారణమని, ఆస్పత్రి యాజమాన్యమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆందోళన చేస్తున్న వారికి సీఐ సత్యనారాయణ సర్దిచెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు. కాగా ప్రజ్వల్ మృతితో కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి.

స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలి



పార్టీ నాయకులు, కార్యకర్తలతో వంశీచంద్‌రెడ్డి

కడ్తాల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సన్నద్ధం కావాలని సీడబ్ల్యూసీ సభ్యుడు చల్లా వంశీచంద్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం స్థానిక నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమాభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఐక్యంగా ముందుకు సాగాలని, పార్టీ సత్తా చాటాలన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, నాయకులు మధుసూదన్‌రెడ్డి, లక్ష్మయ్య, జహంగీర్ బాబా, బాలరాజు, సత్యం, మల్లేశ్, యాదయ్య, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

హద్దులు దాటుతున్న గుట్కా

- గుట్టుగా సాగుతున్న అక్రమ దందా
- గ్రామాల్లో విచ్చల విడిగా అమ్మకాలు
- పట్టించుకోని అధికారులు



పోలీసులు సీజ్ చేసిన గుట్కా ప్యాకెట్లు(ఫైల్)

పెద్దేముల్: ప్రభుత్వం గుట్కా అమ్మకాలను నిషేధించినప్పటికీ గుట్టుగా దందా సాగుతోంది. జిల్లా పరిధిలోని పెద్దేముల్ మండలానికి కర్ణాటక రాష్ట్రం సరిహద్దులో ఉండడంతో మండల పరిధిలోని గ్రామాల్లో ఈ వ్యాపారం విస్తారంగా కొనసాగుతోంది. కొంతమంది అక్రమార్కులు సరిహద్దు రాష్ట్రం నుంచి గంజాయిని తీసుకువచ్చి గుట్టుచప్పుడుకాకుండా విక్రయిస్తున్నారు. ఈ విషయం పోలీసులకు తెలిసినప్పటికీ పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో గుట్కా అమ్మకాలు నిషేధించిన సమయంలో టాస్క్‌ఫోర్స్, సివిల్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి లక్షల రూపాయల విలువ చేసే గుట్కాను స్వాధీనం చేసుకుని కేసులు పెట్టారు. ప్రస్తుతం బహిరంగంగా విక్రయిస్తున్నా పోలీసులకు కనబడడం లేదా అని ప్రశ్నిస్తున్నారు.

కొరవడిన నిఘా

జులై 12న పెద్దేముల్ మండల కేంద్రంలో దాడులు చేసిన పోలీసులు రూ.3,710 విలువైన 1,680 గుట్కా ప్యాకెట్లు సీజ్ చేశారు. 13న బ్లూకోట్ పోలీసులు మండల పరిధిలోని తట్టెపల్లి సమీపంలో దాడులు చేసి రూ.61వేల విలువైన గుట్కాలను పట్టుకుని సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినప్పటికీ అక్రమ వ్యాపారానికి అడ్డుకట్ట పడడం లేదు. అక్రమంగా గుట్కాలు తరలించినా, విక్రయించినా నేరమని చెప్పినా పట్టించుకోవడం లేదు. పోలీసుల నిఘా కొరవడడంతోనే అక్రమ వ్యాపారం మళ్లీ పుంజుకుంటుందని ఆరోపణలు వస్తున్నాయి. కర్ణాటక రాష్ట్రం కుంచారం నుంచి తరలిస్తున్న గుట్కాలు పరిగి, వికారాబాద్ ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు సమాచారం. నిషేధిత గుట్కాలను విక్రయిస్తున్న వారు రెండింతల అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే గుట్కాలు లేవని సమాధానమిస్తున్నారు. దురలవాట్లకు అలవాటు పడిన వారు ఎంత ధరైనా కొనుగోలు చేస్తున్నారు.

పెట్రోల్,డీజిల్ సైతం

మన రాష్ట్రంలో కర్ణాటక రాష్ట్రంతో పోలిస్తే లీటరు డీజిల్, పెట్రోల్‌కు రూ.8 నుంచి రూ.10 ధర ఎక్కువగా ఉండడంతో పొరుగు రాష్ట్రంలో కొనుగోలు తీసుకువచ్చి ఇక్కడ విక్రయిస్తున్నారు. ఈ దందా మండల పరిధిలో ఎక్కువ సాగుతోందని పలువురు వెల్లడిస్తున్నారు.

పటిష్ట బందోబస్తు



ప్రభుత్వ నిషేధిత గుట్కాలు తరలించినా.. విక్రయించినా చర్యలు తప్పవు. ఎవరైనా విక్రయిస్తున్నట్లు గుర్తించి సమాచారమిస్తే చర్యలు తీసుకుంటాం. సరిహద్దుల్లోనూ పోలీస్ బందోబస్తు పటిష్టం చేశాం. గుట్కాలు విక్రయించినా.. పెట్రోల్, డీజిల్ పొరుగు రాష్ట్రం నుంచి తమ దృష్టికి తీసుకువస్తే కేసులు నమోదు చేస్తాం. మండల పరిధి సరిహద్దుకు సమీపంగా ఉండడంతో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నాం.

– గిరి, ఎస్‌ఐ, పెద్దేముల్



కనుల పంట

మండల పరిధిలోని గ్రామాల్లో పంటలు కళ సంతరించుకున్నాయి. మొన్నటిదాక వర్షాలు కురవక రైతులు ఇబ్బంది పడ్డారు. ఇటీవల కురిసిన ముసురు వర్షాలు పంటలకు జీవం పోశాయి. పత్తి, మినుము పంటలు పచ్చగా కళకళలాడుతున్నాయి. – పెద్దేముల్

క్లుప్తంగా

వీహెచ్‌పీలో నియామకం



బాధ్యతలు చేపట్టిన ప్రతినిధులు

అనంతగిరి: దుర్గావాహిని జిల్లా సంయోజక(అధ్యక్షుడి)గా వికారాబాద్‌కు చెందిన శ్రీదేవిని నియమించారు. కామరెడ్డి జిల్లాలో రెండు రోజుల పాటు జరిగిన వీహెచ్‌పీ సమావేశాల్లో జిల్లాకు చెందిన పలువురికి బాధ్యతలు అప్పగించారు. దుర్గావాహిని సహ సంయోజకలుగా కట్ట మాధురి, బర్మావత్ జమున, జిల్లా సామాజిక సమరసత ప్రముఖ్‌గా వడ్ల శ్రీశైలం, జిల్లా మాతృశక్తి సంయోజకగా లక్ష్మి, వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షులుగా దోమ శ్రీకాంత్, స్వప్నలను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్ తెలిపారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం

పర్యావరణ అవార్డు గ్రహీత రామకృష్ణారావు



దాతలకు సర్టిఫికెట్లు అందజేసిన వైద్యసిబ్బంది, రామకృష్ణారావు

చేవెళ్ల: రక్తదానం ప్రాణదానంతో సమానమని ప్రతిఒక్కరూ గుర్తించాలని పర్యావరణ అవార్డు గ్రహీత, సామాజిక వేత్త పి.రామకృష్ణారావు అన్నారు. మండల కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో ఆదివారం గాంధీ ఆస్పత్రి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇందులో సుమారు 100 మంది ప్రాంత యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణారావు మాట్లాడుతూ.. చేవెళ్ల ప్రాంత యువత ఎంతో సేవా దృక్పథం కలిగిన వారని కొనియాడారు. ఎప్పుడు ఏ కార్యక్రమం తీసుకున్న స్వచ్ఛందంగా ముందుకు వస్తారని పేర్కొన్నారు. రక్తదానం చేస్తే ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఈ సందర్భంగా రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో గాంధీ ఆస్పత్రి రక్తనిధి మెడికల్ ఆఫీసర్ సత్యప్రభ, మెడికల్ కౌన్సిలర్ సునీత, సిబ్బంది, స్థానిక యువత పాల్గొన్నారు.

ఫిలింనగర్‌లో చోరీ

ఫిలింనగర్: బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఇంట్లోకి చొరబడి విలువైన బంగారు ఆభరణాలను తస్కరించిన సంఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్–80లో నివసించే శారదారెడ్డి ఈ నెల 9న రాత్రి వజ్రాలతో పొదిగిన మంగళసూత్రంతో పాటు తదితర ఆభరణాలను టేబుల్‌పై ఉంచింది. ఆదివారం ఉదయం ఆభరణాలు వేసుకునేందుకు చూడగా అవి కనిపించలేదు. సీసీ ఫుటేజీలను పరిశీలించగా శనివారం తెల్లవారుజామున బైక్‌పై ఇద్దరు యువకులు అక్కడికి వచ్చినట్లు గుర్తించారు. వారిలో ఒకరు బైక్‌పై కూర్చోగా, మరో వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించి బెడ్‌రూంలో ఉన్న బంగారు ఆభరణాలను అపహరించినట్లు రికార్డయ్యింది. ఫిర్యాదుతో పాటు ఆమె సీసీ ఫుటేజీలను పోలీసులకు అందజేశారు. ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బీజేవైఎం నేతకు స్వాగతం



రోహిత్ చాహల్‌ని శాలువాతో సత్కరిస్తున్న నాయకులు

చేవెళ్ల: రాష్ట్ర పర్యటనకు విచ్చేసిన బీజేవైఎం జాతీయ ప్రధాన కార్యదర్శి రోహిత్ చాహల్‌ని స్థానిక పార్టీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆదివారం శంషాబాద్ విమానాశ్రయంలో ఆయనను కలిసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు చేవెళ్ల మహేందర్, సురేందర్ శర్మ, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి, నాయకులు వైభవ్‌రెడ్డి, ఇంద్రాసేనారెడ్డి, మచ్చేందర్ రెడ్డి, కృష్ణ, దామోదర్ తదితరులున్నారు. ఈ సందర్భంగా ఆయనకు వారు పూలబొకేను అందించి శాలువాతో సన్మానించారు.

కూలీల కొరత.. కర్షకుల వెత

- నారు నాటేవారు లేరు.. కలుపు తీసేవారు కరువు
- పెరుగుతున్న పెట్టుబడులు
- రెండింతలైన వ్యవసాయ కూలీల రేట్లు
- దిగాలు చెందుతున్న రైతన్న



నాటు వేసేందుకు సిద్ధంగా వరి పొలం

పరిగి: వానాకాలం సీజన్ మొదలయినప్పటికీ.. వరుణుడు కరుణ చూపడం లేదు. దీంతో భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టాయి. అయినప్పటికీ.. ఆకాశం వైపు ఆశగా చూస్తూ వర్షాలు పడకపోతాయా.. పంటలు పండక పోతాయన్న చిన్న ఆశతో వరినాట్లు వేయాలనుకున్న చిన్నసన్నకారు రైతులను కూలీల కొరత వేధిస్తోంది. ఇక సాగు చేసిన పంటల్లో కలుపు తీతకు అవే కష్టాలు వెంటాడుతున్నాయి. దీంతో పంటకు మించి పొలాల్లో కలుపు పెరుగుతుండటం గమనార్హం. అధిక ప్రాంతాల్లో ఒకేసారి వరి నాట్లు, కలుపుతీత పనులకు రైతులు సిద్ధం కావడంతో కూలీలకు డిమాండ్ పెరిగింది. స్థానికంగా దొరకక, భారమైనా.. అధిక మొత్తంలో కూలి డబ్బులు చెల్లించి వలస కూలీలతో పనులు చేయిస్తున్నారు. కూలీల రేట్లు, సాగు పెట్టుబడి పెరిగి కర్షకులు ఇబ్బంది పడుతున్నారు.

రూ.800లు చెల్లించినా..

జిల్లాలో రైతులు ఎక్కువగా వర్షాధార పంటలపైనే ఆధార పడుతుంటారు. ప్రస్తుత సీజన్‌లో గతేడాదితో పోలిస్తే.. ఈ సారి చాలా తక్కువగా వానలు కురిసాయి. అయినా రైతులు వరి సాగుపైనే దృష్టి సారించారు. ఈ పంటలకు నాటు వేయడానికి, కలుపు తీయడానికి కూలీల అవసరం తప్పనిసరి. నారు మళ్లలో నారు, నాటడానికి పొలాలు సిద్ధంగా ఉన్నాయి. కానీ పనిచేసే వారు లేక కర్షకులు ఇబ్బంది పడుతున్నారు. సమయానికి నాట్లు పడటం లేదని దిగాలు చెందుతున్నారు. గతంలో రూ.250 నుంచి రూ.300వరకు కూలి చెల్లించేవారు. ప్రస్తుతం రూ.700 నుంచి రూ.800లు ఇచ్చినా కూలీలు దొరకని పరిస్థితి.

మదురుతున్న నారు



పాలేపల్లిలో నారుమడి

ఇప్పటికే వరి నాట్లు వేసి కలుపు తీయాల్సి ఉండగా.. పలు ప్రాంతాల్లో నాట్లే పూర్తి కాలేదు. నారుమళ్లు ముదురుతుండటంతో పంట దిగుబడిపై ప్రభావం చూపుతుందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో వేసిన పంటల్లో కలుపు తీసేవారు లేక.. పంటలు దెబ్బతింటున్నాయి. చేసేది లేక రైతులు కలుపు మందులు పిచికారీ చేసి చేతులు దులుపుకొంటున్నారు. దీనికంతటికీ కారణం.. కూలీల కొరతేనని, పెట్టుబడులు కూడా దక్కేటట్లు లేవని కర్షకులు కలత చెందుతున్నారు.

తగ్గుతున్న వ్యవసాయ కూలీలు



సాగుకు పెట్టుబడితో పాటు కూలీల రేట్లు బాగా పెరిగాయి. అది చాలా భారంగా మారింది. రెండింతలు వెచ్చించినా కూలీలు దొరకని దుస్థితి. కాలానుగుణంగా వ్యవసాయ కూలీ పనులు చేసేవారి సంఖ్య నానాటికీ తగ్గుతోంది. ఒకరిద్దరితో చేసే పనికాదు. ఇది సాగుపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

– పోచయ్య, రైతు, ఇప్పాయిపల్లి

కష్టంగా మారింది



పంట సాగు చేయాలంటే కష్టంగా మారింది. వ్యవసాయం చేయడానికి కూలీల అవసరం తప్పనిసరి. విత్తనాలు విత్తిన నాటి నుంచి కోత, నూర్పిడి తదితర పనులకు వారిదే కీలక భూమిక. రైతులంతా ఒకే సారి పంట సాగు చేయడంతో కూలీల కొరత ఏర్పడింది. ఇప్పుడు ఏం చేయాలో పాలుపోవడం లేదు.

– తిరుపతి, రైతు, పాలేపల్లి

ఐనా'పూర్' రోడ్డు

- కంకర తేలి.. గుంతలు ఏర్పడి
- మరమ్మతుకు నోచుకోని బీటీ



పాలేపల్లి-ఐనాపూర్ బీటీరోడ్డు దుస్థితి

దోమ: కురుస్తున్న వర్షాలకు గ్రామీణ ప్రాంత రోడ్లు అధ్వానంగా మారాయి. దారి పొడవునా గుంతలు ఏర్పడి, నీరు నిలుస్తున్నాయి. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులకు నరకం కనబడుతోంది.

చాలా కాలంగా..

మండల పరిధి పాలేపల్లి మీదుగా ఐనాపూర్ వెళ్లే ప్రధాన బీటీరోడ్డు రూపం కోల్పోయింది. కంకర తెలి గుంతలు ఏర్పడి ప్రమాదాలకు నిలయంగా మారింది. చీకటి పడితే ఈ రహదారుల్లో వెళ్లలేని దుస్థితని పరిసర ప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చాలా కాలంగా ఇదే పరిస్థితి కొనసాగుతుందని, అయినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ప్రజా రవాణాను దృష్టిలో పెట్టుకుని, సంబంధిత అధికారులు గ్రామీణ ప్రాంత రోడ్లకు మరమ్మతు లేదా పునఃనిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. తొలుత పాలేపల్లి-ఐనాపూర్ వెళ్లే ప్రధాన బీటీరోడ్డును నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రతిపాదనలు పంపించాం

గ్రామీణ ప్రాంతాల బీటీరోడ్లు పలు చోట్ల కంకర తేలి గుంతలు ఏర్పడ్డాయి. పంచాయతీ రాజ్ పరిధిలో దెబ్బతిన్న రహదారుల గురించి ఉన్నతాధికారులకు ఇప్పటికే ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాగానే రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం.

– లక్ష్మయ్య, పంచాయతీ రాజ్ డీఈ

కత్తి చూపి.. బెదిరించి..

నగదు, సెల్‌ఫోన్ అపహరణ



బాధితుడు అఫ్జల్

తాండూరు టౌన్: కత్తితో బెదిరించి ఓ ప్రయాణికుడి వద్ద నగదు, సెల్‌ఫోన్, సామగ్రిని కాజేశాడు ఓ దొంగ. ఈ సంఘటన తాండూరు రైల్వే స్టేషన్ సమీపంలో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన అఫ్జల్.. లారీ మరమ్మతు చేసేందుకు తాండూరుకు వచ్చాడు. అనంతరం అర్ధరాత్రి హైదరాబాద్‌కు వెళ్లేందుకు తాండూరు రైల్వే స్టేషన్‌కు వచ్చాడు. ఈ క్రమంలో ఓ వ్యక్తి అఫ్జల్‌కు కత్తి చూపి బెదిరించాడు. అతడి వద్ద ఉన్న రూ.1200 నగదు, సెల్‌ఫోన్, వెల్డింగ్ యంత్రాన్ని అపహరించాడు. ఇదే విషయమై రైల్వే, పట్టణ పోలీసులను వివరణ కోరగా.. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

కానరాని పోలీసులు

చీకటి దాటిన తరువాత తాండూరు రైల్వేస్టేషన్ నుంచి అధికంగా రైళ్ల రాకపోకలు ఉంటాయి. ఈ సమయంలో రైలు కోసం ఎదురు చూసే ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. ప్రాంగణం మొత్తం చీకటి మయంగా ఉండటం, పోలీసుల పహారా లేకపోవడంతో ఆకతాయిల ఆగడాలు పెరిగిపోతున్నాయని, తాగిన మైకంలో బెదిరింపులకు పాల్పడుతూ.. దోపిడీకి తెగబడుతున్నారని వాపోతున్నారు. వారితో పాటు దొంగలు కూడా పేట్రేగిపోతున్నారని పేర్కొంటున్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం రాత్రి వేళలో రైల్వే, పట్టణ పోలీసులు గస్తీ నిర్వహించాలని కోరుతున్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించండి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వ్యవసాయ, కార్మిక సంఘం నాయకులు

పరిగి: జిల్లాలో అన్యాక్రాంతమైన భూముల పరిరక్షణకు ఈ నెల 13న నిర్వహించే భూ సదస్సును జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట సదస్సు వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. మండల పరిధి రంగాపూర్‌లోని సర్వే నంబర్ 18లో 9.39 ఎకరాల అసైన్డ్ భూమిని పేద ప్రజల నివాసాలకు కేటాయించాలని, నారాయణపూర్‌లో ఆక్రమణకు గురైన 32 ఎకరాల భూదాన్ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, నిరు పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో కొడంగల్ పట్టణ కేంద్రంలోని బసిరెడ్డి ఫంక్షన్ హాల్లో నిర్వహించే సదస్సుకు రైతులు అధిక సంఖ్యలో రావాలని కోరారు. కార్యక్రమంలో సత్తయ్య, రఘురావ, శేకర్, కృష్ణ, రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



బాల్‌రాజ్(ఫైల్)

పరిగి: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన నస్కల్ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ధారూర్ మండలం మైలారం గ్రామానికి చెందిన కావలి బాల్‌రాజ్(35) పరిగి నుంచి వికారాబాద్ వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో నస్కల్‌లో రోడ్డుపై నిలిచి ఉన్న ముస్తఫాను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయ పడిన బాలరాజ్ అక్కడిక్కడే మృతి చెందాడు. ముస్తఫాకు స్వల్ప గాయాలు అయ్యాయి. ముస్తాఫ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సంతోష్ తెలిపారు.మృతుడికి భార్య శ్రీలత, కుమా రుడు, కూతురు ఉన్నారు.

కరాటేలో విద్యార్థి ప్రతిభ

కొందుర్గు: కల్వకుర్తి పట్టణంలో ఆదివారం జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని నహీద్ ప్రతిభ చూపినట్లు మాస్టర్ రమేశ్ తెలిపారు. అండర్–12 స్పైరింగ్ విభాగంలో సత్తాచాటినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బాలికకు నిర్వాహకులు మల్లికార్జున్‌గౌడ్ మెడల్స్‌తో పాటు ప్రశంసాపత్రం అందజేశారు.



బోటింగ్ చేస్తున్న యువతీయువకులు

కోట్‌పల్లికి సందర్శకుల తాకిడి



ఫొటోకు ఫోజిస్తున్న యువకుడు

ధారూరు: రెండు రోజుల సెలవుల నేపథ్యంలో కోట్‌పల్లి ప్రాజెక్టు పర్యాటకులతో కళకళలాడింది. వందలాది సందర్శకులతో ప్రాజెక్టు ప్రాంగణంలో సందడి నెలకొంది. ఈ సందర్భంగా జలాశయంలో బోటింగ్ చేసేందుకు పోటీపడ్డారు. పరిసర ప్రాంతాల అందాలను ఆస్వాదించారు. ఫొటోలు, సెల్ఫీలు దిగుతూ కేరింతలు కొట్టారు.

రుణమాఫీ ఎందుకు కాలేదు?

సంబంధిత అధికారులపై కలెక్టర్ సీరియస్

సాక్షి ఎఫెక్ట్..

తాండూరు: రైతులకు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం రెండు విడతలుగా రుణమాఫీ చేసింది. ఇందులో సగం మందికే లబ్ధి చేకూరింది. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో 'మాఫీ ఫ్లీజ్' శీర్షికన ఆదివారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ ప్రతీక్‌జైన్ స్పందించారు. చిన్నసన్నకారు రైతులకు మాఫీ కాకపోవటం ఏమిటని సంబంధిత అధికారులపై సీరియస్ అయినట్లు సమాచారం. రుణమాఫీ పొందని రైతుల వివరాలను సేకరించి నివేదిక అందజేయాలని వ్యవసాయ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు.. అభిప్రాయం తెలిపిన తాండూరు మండలం ఐనెల్లి గ్రామానికి చెందిన మహిళా రైతు వెంకటమ్మతో మండల వ్యవసాయ అధికారి ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఆధార్ కార్డు తీసుకున్నారు. మరి కొందరి ఆధార్ కార్డులను సేకరించారు. లబ్ధిపొందని రైతులు రుణాలను 2018 డిసెంబర్ కంటే ముందే పొందారా.. డిసెంబర్ తర్వాత తీసుకున్న రుణాలను రెన్యువల్ చేసుకున్నారా లేదా అంటూ ఆరా తీశారు.

కుక్కల దాడిలో మేకల మృతి

తలకొండపల్లి: కుక్కల దాడిలో నాలుగు మేకలు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని చౌదర్‌పల్లిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బైండ్ల నరసింహ తన వ్యవసాయ పొలం వద్ద శనివారం సాయంత్రం మేకలను పాకలో ఉంచి ఇంటికి వెళ్లాడు. ఆదివారం ఉదయం పొలం వద్దకు వెళ్లగా.. పాకలో నాలుగు మేకలు మృతి చెంది ఉన్నాయి. రాత్రి కుక్కలు దాడి చేయడంతో మేకలు మృత్యువాత పడ్డాయని నరసింహ తెలిపారు. మృతి చెందిన మేకల విలువ రూ.60 వేలు ఉంటుందని ప్రభుత్వమే ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

దుకాణానికి నిప్పంటించిన దుండగులు

రూ.రెండు లక్షలకు పైగా నష్టం



మంటల్లో కాలిబూడిదైన పాన్‌షాప్

అబ్దుల్లాపూర్‌మెట్: విజయవాడ జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఓ పాన్ షాప్‌కు దుండగులు అర్ధ రాత్రివేళ నిప్పుపెట్టారు. దీంతో దుకాణ పూర్తిగా దగ్ధమయింది. ఈ సంఘటన పెద్దఅంబర్‌పేటలో ఆలస్యంగా వెలుగు చూసింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దఅంబర్‌పేటలోని తాజా టిఫిన్ హోటల్ వద్ద ఆరునెలల క్రితం మహ్మద్ నిజాం ఓ పాన్ షాప్‌ను లీజుకు తీసుకుని కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి 12 గంటలకు దుకాణం మూసివేసి ఇంటికి వెళ్లారు. శనివారం తెల్లవారుజామున వచ్చి చూసే సరికి షాపు పూర్తిగా దగ్ధమై ఉంది. వెంటనే హయత్‌నగర్ పోలీసుల సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. సీసీ కెమెరాలను పరిశీలించారు. దుకాణ పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాలను పరిశీలించగా.. నలుగురు ముసుగు ధరించిన వ్యక్తులు నిప్పంటించిన దృశ్యాలు కనిపించాయి. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అనంతరం బాధితుడు మహ్మద్ మాట్లాడుతూ.. దుకాణం దగ్ధమవడంతో రూ.రెండు లక్షలకు పైగా నష్టపోయానని, దుండగులను శిక్షించి న్యాయం చేయాలని కోరాడు.

మహనీయులను స్మరించుకోవాలి



మహనీయుల విగ్రహాల వద్ద బీజేపీ నాయకులు

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రకాశ్

మొయినాబాద్ రూరల్: మహనీయుల విగ్రహాలను శుభ్రం చేసుకుని, వారి సేవలను స్మరించుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాశ్ అన్నారు. ఆదివారం మండలంలోని మెదక్‌నగర్ చౌరస్తాలో బాబూ జగ్జీవన్‌రామ్, బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలను బీజేపీ యువమోర్చా నాయకులతో కలిసి ఆయన శుభ్రం చేయించారు. అనంతరం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహనీయులను స్మరించుకున్నప్పుడే దేశభక్తి పెంపొందుతుందన్నారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు మహనీయుల విగ్రహాల శుద్ధి కార్యక్రమం చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఇందులో నాయకులు మధుసూదన్‌రెడ్డి, నరసింహారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, జ్ఞానేశ్వర్ ఉన్నారు.

జీవన ఎరువు.. సాగుకు ఆదరువు

- రైతులకు తగ్గనున్న పెట్టుబడి భారం
- పెరగనున్న పంట దిగుబడులు
- కృషి విజ్ఞాన కేంద్రం క్రీడా నిపుణుడు శ్రీకృష్ణ



కందుకూరు: పంటల సాగులో ఎరువుల పాత్ర అత్యంత కీలకం. మొక్క ఎదిగి మంచి దిగుబడులు రావాలంటే అన్నదాతలు సకాలంలో ఎరువులను ప్రయోగించాలి. వీటిలో జీవన ఎరువుల వాడకం రైతులకు పెట్టుబడిభారాన్ని తగ్గిస్తోంది. ప్రకృతిలోని సూక్ష్మజీవులు పోషకాలను గ్రహించి మొక్కలకు ఉపయోగపడే హార్మోన్లను సమకూర్చే సముదాయాన్ని జీవన ఎరువులు(బయోఫర్టిలైజర్) అంటారు. వీటి ఉపయోగంతో రైతులకు కృత్రిమ ఎరువుల భారం తగ్గి, దిగుబడులు పెరుగుతాయని కృషి విజ్ఞాన కేంద్రం క్రీడా నిపుణుడు జి.శ్రీకృష్ణ పేర్కొంటున్నారు. ఆయన జీవన ఎరువుల వాడకం, వాటి ఉపయోగం గురించి రైతులకు పలు సూచనలిచ్చారు. జీవన ఎరువులు రెండు రకాలు. నత్రజని స్థిరీకరించేవి, భాస్వరాన్ని అందుబాటులోకి తెచ్చేవి.

నత్రజని జీవన ఎరువులు

వేరుశనగ, వరి, పప్పుధాన్యాల్లో వీటి వాడకంతో రసాయన ఎరువుల వాడకం 20–30 శాతం తగ్గించవచ్చు. ఉదాహరణకు రైజోబియం, అజటోబ్యాక్టర్, అజోస్పైరిల్లం, అసిటోబ్యాక్టర్, బ్లూగ్రీన్ ఆల్గే, అజోల్లా మొదలైనవి.

రైజోబియం

ఇది ఒక బ్యాక్టీరియా జాతికి సంబంధించినది. ఇది పప్పు జాతి మొక్కల వేరు వ్యవస్థ ద్వారా సహజీవనం చేస్తాయి. వేరుశనగ, కంది, పెసర, మినుము, అలసంద, చిక్కుడు, సోయా వంటి పంటల వేర్లకు ఉండే చిన్న చిన్న బుడిపెల్లో ఉంటాయి. ఇవి గాలిలో నత్రజని గ్రహించి మొక్క వేర్లకు అందిస్తాయి. నత్రజని పంట పెరుగుదలలో ఉపయోగపడే ముఖ్య పోషకం. వాతావరణంలో 70 శాతం పైగా వ్యాపించి ఉన్నప్పటికీ భూమిలో అత్యంత తక్కువగా ఉండటంతో మొక్కకు నత్రజని లోపం ఏర్పడుతుంది. రైజోబియం వంటి సూక్ష్మజీవులకు వాతావరణంలోని నత్రజనిని గ్రహించి/స్థిరీకరించి మొక్కకు అందించే సామర్థ్యం ఉంది.



పశువుల ఎరువులో నిల్వ ఉన్న జీవన ఎరువు

అజటోబాక్టర్

ముఖ్యంగా వరి, చెరుకు, జొన్న, సజ్జ, పత్తి, మిరప, పొద్దుతిరుగుడు, కూరగాయల పంటలకు బాగా పనిచేస్తాయి. పెరుగుదలకు కారకాలైన హార్మోన్లను, విటమిన్లను ఉత్పత్తి చేస్తాయి.

అజోస్పైరిల్లం

అవి సహవాసి సూక్ష్మజీవులు, గాలిలోని నత్రజని తీసుకుని వేర్ల మీద స్థిరీకరించగలవు. పప్పుజాతి పైర్లు కాక మిగిలిన అన్ని పైర్లకు ఉపయోగపడతాయి. వరి, చెరుకు, పత్తి, అరటి మొదలైనవి.

అసిటోబ్యాక్టర్:

ఇవి చెరుకు వేర్లు, కాండం, ఆకుల మీద నివసిస్తూ విధిగా సహాయపడే సూక్ష్మజీవులు. ఇవి అజోస్పైరిల్లం ఉత్పత్తి చేసే దానికి రెండింతలు ఇండోల్ ఎసిటిక్ ఆసిడ్ హార్మోన్లను ఉత్పత్తి చేయగలవు. చక్కెర శాతం 0.5–1 శాతానికి పెరుగుతుంది.

అజోల్లా

ఇది సాధారణంగా బావులు, చెరువులు, కొలనులు, వరి పొలాల్లో నీటిపై తేలియాడుతూ కనిపించే ఫెర్న్ జాతి మొక్క. ఇది నత్రజని స్థిరీకరించే నీలి ఆకుపచ్చ నాచు(అనాబినా)తో సహజీవనం సాగిస్తూ నత్రజనిని ఉపయోగించుకుంటూ బాగా పెరిగి నేలలో కలుస్తుంది. 40–60 కిలోల నత్రజనిని వరి పైరుకు అందిస్తుంది.

నీలి ఆకుపచ్చ నాచు

ఇది వరి పైరుకు ఉపయోగించాల్సిన జీవన ఎరువు. దీని వాడకంతో ఎకరాకు 8–12 కిలోల నత్రజని పైరుకు అందుతుంది. వరి నాటిన వారం పది రోజుల్లో ఎకరాకు 4 కిలోల నాచుపొడిని నీటిపై చల్లాలి. పొలంలో కనీసం వారం వరకు తగిన నీరు ఉండేటట్లు చూడాలి. మొక్క వేర్లకు ఆక్సిజన్ కావాల్సినంతగా లభ్యమవుతుంది. దీన్ని 3-4 పంట కాలాలను వరుసగా వేస్తే తర్వాత వేయనవసరం లేదు.

భాస్వర జీవన ఎరువులు(పీఎస్‌బీ)

భాస్వరం అందించడానికి ఫాస్ఫోబ్యాక్టీరియా, మైకోరైజా ఎరువులు అందుబాటులో ఉన్నాయి.

➡ ఫాస్ఫోబ్యాక్టీరియా

వీటిని ఫాస్ఫరస్ సాల్యుబిలైజింగ్ మైక్రో ఆర్గానిజమ్స్ అంటారు. వీటిలో సుడోమోనాస్, బాసిల్లస్ సూక్ష్మజీవులు, పెన్సీలియం, అస్పర్జిల్లస్ శిలీంద్రాలు ముఖ్యమైనవి. వీటి చర్యలతో నీటిలో కరగని రూపంలో ఉన్న భాస్వరాన్ని కరిగేలా చేసి మొక్కకు అందిస్తాయి. అందుకు అవసరమైయ్యే సేంద్రియ ఆమ్లాలు ఈ సూక్ష్మజీవుల నుంచి వృద్ధి చెందుతాయి.

➡ ఫాస్ఫేటు మొబిలైజింగ్ మైకోరైజా(వీఏఎం)

ఇది శిలీంధ్రం(బూజు) జాతికి చెందినది. కంటికి కనిపించదు. ఈ బూజు వేరు కంటే బాగా విస్తరించి పోషకాలను, తేమను, పీల్చుకుని మొక్క వేర్లకు అందిస్తుంది.

ప్రస్తుతం ఈ ఎరువులు ఘన, ద్రవ రూపాల్లో అందుబాటులో ఉన్నాయి. రాజేంద్రనగర్‌లోని ప్రొ.జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, కేంద్రీయ మెట్ట పంటల పరిశోధన సంస్థ హయత్‌నగర్‌లో లభిస్తాయి. వీటిని పశువుల ఎరువులో కలిపి 15 రోజుల పాటు నిల్వ ఉంచి అనంతరం పంటలో వేయాలి.